# రక్షణ బాధ్యత రమణీమణిది కూడా



*అన్యాసు తావదుపమర్ద సహో సుభృంగ*
*లోలం వినోదయ మనః సుమనోలతాసు*
*ముగ్ధామజాత రజసాంకలి కామకాలే*
*వ్యర్థం కదర్దయసికిం నవమాలికాయాః*

***భావం:*** ఓ తుమ్మెదా, నువ్వు మర్దించినా సహించగల పుష్పలతల మీదకి కోరిక ఉన్న మనస్సు లగ్నం చేసి వినోదించు. రజస్సు పుట్టని దానిని, నవమాలిక యొక్క లేత మొగ్గని అకాలంలో వ్యర్థంగా నిర్బంధిస్తావెందుకు?

నళినికి అందగాడైన కల్యాణ వర్మతో వివాహమైంది. కల్యాణవర్మ రాజా స్థానంలో ఉన్నతోద్యోగి. ఆస్తిపరుడు. అత్తా, ఆడపడుచుల పోరు లేదు. ఇంత కన్నా ఏ అమ్మాయి అయినా ఏం కోరుకుంటుంది. నళిని జీవితమంతా నందన వనవిహారమే అనుకుని కోటి ఆశలతో కాపురానికి వచ్చింది.

వచ్చిన వారానికే కల్యాణవర్మ అసలు రూపం ఆమెకు తెలిసింది. అతడు బహుప్రియావ్రతుడు. కేవలం భార్యతో తృప్తిగా జీవించే లక్షణం లేదు. రోజుకో కొత్త అమ్మాయి కావాలి. విషయం తెలిసిన నళిని తన ప్రవర్తనతో అతనిలో మార్పు తేవాలని ప్రయత్నించి విఫలురాలైంది. తనలో లోపమేమిటో ఆమెకు తెలియలేదు.

కల్యాణవర్మ అందానికీ, వాక్చాతుర్యానికీ ఎందరో అమ్మాయిలు అతని చేత ఆకర్షింపబడేవారు. కొందరిని ధనమిచ్చి తన వైపు తిప్పుకునేవాడు. ఏదీ కుదరని చోట పశుబలంతో లొంగదీసుకునేవాడు. ఇంకే ప్రయత్నమూ ఫలించనప్పుడు సానివాడల వైపు దృష్టి సారించేవాడు.

బరితెగించిన కల్యాణ వర్మ ఇంటికే అమ్మాయిలను తెచ్చుకోవడం ప్రారంభించాడు. నళిని దుఃఖసాగరంలో మునిగిపోయింది. పుట్టింటికి వెళ్ళడం కానీ, వారికీ విషయం చెప్పడం కానీ ఆమెకిష్టం లేదు. అందువల్ల వారిని దుఃఖపెట్టడం తప్ప ఏం సాధించలేమని ఆమె ఊహ.

అటువంటి పరిస్థితిలో నళిని చెల్లెలు పదేళ్ళ పిల్ల ఆమెను చూడ్డానికి వచ్చింది. రాజధానికి వస్తున్న బంధువులతో ఆమె అక్కను చూడడానికి వచ్చింది. నళిని ఎంతో సంతోషించింది. చెల్లెలితో కాలం గడుపుతూ బాధ మర్చిపోయింది. నాలుగు రోజుల తర్వాత కల్యాణవర్మ డబ్బు అవసరమై ఇంటికి వచ్చాడు. నళిని చెల్లెలు తోటలో చేతులు పైకెత్తి పండు కోసుకుందుకు ప్రయత్నిస్తోంది. కల్యాణవర్మ ఆ పిల్ల దగ్గరకు వెళ్ళి 'నేను ఎత్తుకుంటాను. కోసుకో' అంటూ ఆమెను ఎత్తి బుగ్గపై ముద్దు పెట్టాడు. పదేళ్ల పిల్ల బిత్తరపోయింది. 'బావుందా' అంటూ ఇంకా ఏమో చెయ్యబోతున్న భర్తను కిటికీలో నుంచి చూసిన నళిని పరిగెత్తుకుంటూ వచ్చింది.

ఓ తుమ్మెదా! నువ్వు మర్దించినా సహించగల పుష్పలతల మీదకి కోరిక ఉన్న మనస్సు లగ్నం చేసి వినోదించు. రజస్సు పుట్టని దానిని, నవ మాలిక యొక్క లేత మొగ్గని అకాలంలో వ్యర్థంగా నిర్బంధిస్తావెందుకు' అని

నళిని అంది. 'నువ్వు ఇతరత్రా ఎంతమంది అమ్మాయిలతో తిరిగినా ఊరుకున్నాను. రజస్వల కూడా కాని పసిపిల్ల అయిన నా చెల్లెలిని బలాత్కరిస్తే ఊరుకోను' అన్న భావంలో పద్యం చదివి నళిని చెల్లెల్ని భర్త దగ్గర నుంచి తీసికెళ్లిపోయింది. కల్యాణవర్మ లాంటి కర్కోటకులకు ఈనాడూ కరువు లేదు. బావలు మరదళ్లనీ, మామలు కోడళ్లనీ, ఆఖరుకీ తండ్రులు కూతుళ్లనీ బలాత్కారంగా అత్యాచారం చేస్తున్న విషయాలనీ, అందునా అభం శుభం తెలియని పసిపిల్లలు కూడా అత్యాచారానికి గురవడాన్నీ వార్తలుగా చదువుతూనే ఉన్నాం. నళిని లాంటి కాపాడే అక్కలూ, అత్తలూ, అమ్మలూ ఉంటే ఇన్ని అన్యాయాలు జరగవేమో కదా.

******